క్లుప్తంగా

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ శంకరరావు

బలిజిపేట: గంగాడలో అంబేడ్కర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఎంపీటీసీ శంకరరావు గురువారం ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించే పోటీల్లో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు అందించనున్నట్టు తెలిపారు. పోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఈజీపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: మండలంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వేలో భాగంగా గ్రామాల్లో స్వమిత్వ సర్వే పనులను ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. పాపమ్మవలస గ్రామంలో జరుగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల గ్రామ కంఠాల విస్తీర్ణం, ఉన్న కట్టడాల సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కంఠాల్లో సర్వే చేస్తున్న అధికార సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటికే ఎనిమిది గ్రామాల్లో స్వమిత్వ సర్వే జరుగుతోందని తెలిపారు. సర్పంచ్ ఎం.గౌరునాయుడు, ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇక నిరంతర వైద్య సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ నిహారిక

సీతానగరం: మండలంలోని ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువయ్యాయని సీతానగరం పీహెచ్‌సీ 104 వైద్యాధికారిణి బి.నిహారిక అన్నారు. మండల కేంద్రంలో నిరంతర 104 సంచార వైద్య కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి మంజూరైన 104 సంచార వాహనం ద్వారా ఇప్పటి వరకు సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీల పరిధిలోని 44 గ్రామాల్లో ట్రైల్ రన్‌గా వైద్య సేవలు అందించామన్నారు. కొత్తగా ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి ఒకటి చొప్పున 104 సంచార వైద్య సేవందించేందుకు వాహనాలు మంజూరు చేసినట్టు తెలిపారు. సర్పంచ్ జె.తేరేజమ్మ, 104 సిబ్బంది దుర్గారావు, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పార్వతీపురం టౌన్: శ్రీజన్ గ్లోబల్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న ఎస్.షణ్ముక్ సిద్దార్థ్ రాజస్తాన్ కోట స్పోర్ట్స్ యూనివర్సిటీలో 36వ సబ్ జూనియర్ నేషనల్ లెవెల్ తైక్వాండో చాంపియన్ షిప్ 2022 – 23 ఫైనల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. దీంతో ఆ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ యు.శ్రీను, ప్రిన్సిపాల్ ఈ.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సిద్దార్థ్‌ను గురువారం అభినందించారు.

ఏరియా ఆస్పత్రిలో ఐసీడీ ఇన్‌సెర్షన్ శస్త్రచికిత్స



రోగితో ఆపరేషన్ చేసిన వైద్యులు

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఐసీడీ ఇన్‌సెర్షన్ ఆపరేషన్‌ను వైద్యులు గురువారం విజయవంతంగా చేశారు. ఊపిరితిత్తుల్లో నీరు చేరినా, చీము పట్టినా ఈ ఆపరేషన్ చేస్తారు. గతంలో ఇటువంటి రోగులను విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేసేవారు. కాగా ప్రభుత్వం అత్యాధునిక పరికరాలు ఇక్కడ ఆస్పత్రిలో ఏర్పాటు చేయడం, అనుభవజ్ఞులైన వైద్యులు ఉండడంతో ఈ ఆపరేషన్ తొలిసారిగా డాక్టర్ అనిల్, డాక్టర్ శామ్యూల్, డా.రత్నకుమారి విజయవంతంగా చేశారు. వైద్యులను స్థానికులు అభినందించారు.

దేశానికే రోల్ మోడల్.. ‘ఫ్యామిలీ డాక్టర్’

- అందుబాటులోకి 24 గంటలూ వైద్యసేవలు
- రోగులకు 105 రకాల మందులు
- ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో పేద ప్రజలకు 24 గంటలూ వైద్యం ఉచితంగా అందాలనే ఉద్దేశంతో ఏపీలో ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. దేశ చరిత్రలోనే వైద్యసేవల విధానంలో నూతన విధానానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, ఇది దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే జోగారావు ఆకాంక్షించారు. ఏపీలో ‘ఫ్యామిలీ డాక్టర్’ విధానాన్ని రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం వేదికగా అధికారికంగా ప్రారంభించగా గురువారం పార్వతీపురం నియోజకవర్గం స్థాయిలో నర్సిపురం గ్రామం వద్ద ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగాన్ని ఆలకించిన అంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఏపీలో రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభం అవుతాయని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఉంటాయని, ఇందులో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయని



జెండా ఊపి 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

చెప్పారు. ఈ క్లినిక్‌లు పీహెచ్‌సీలతో అనుసంధానించబడతాయని చెప్పారు. వీటిలో సాధారణ వైద్య సేవలతో పాటు తల్లులు, బాలింతలకు వైద్య సేవలు అందుతాయని వివరించారు. మండలానికి రెండు పీహెచ్‌సీలు, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. అయితే మన మండలానికి 3 పీహెచ్‌సీలు అందుబాటులో ఉండటం మన అదృష్టమని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ పరిధిలో నయం కాని రోగాలను వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ఆరోగ్యశ్రీకి రిఫర్ చేస్తారని చెప్పారు. డాక్టర్ కోసం ప్రజలు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే అన్నారు. ఆస్పత్రులు, డాక్టర్ల చుట్టూ ఆరోగ్యం దెబ్బతిన్నవారు తిరగాల్సిన అవసరం ఉండదని చెప్పారు.

ప్రతి పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని చెప్పారు. ప్రతి 2 వేల జనాభాకు ఓ క్లినిక్ ఉంటుందని, మండలానికి రెండు పీహెచ్‌సీలు ఉంటాయని, ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు, ఒకరు పీహెచ్‌సీలో ఉంటే, మరొకరు ఆంబులెన్స్‌లో తిరుగుతుంటారని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా 104 వాహనాలను ప్రారంభించి అందులో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను, మందులను పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్ధ జగన్నాధరావు పూడి శంకరరావు మండల పార్టీ అధ్యక్షుడు బి.రమేష్, వైద్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణ పనులు



బీటీ రహదారి నిర్మాణంపై అధికారులతో చర్చిస్తున్న పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం: కొత్తగా నిర్మితమవుతున్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. పార్వతీపురం మండలం చినమరికి గ్రామం నుండి ఆర్‌కె.బట్టివలస గ్రామానికి మధ్య జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ఏకలవ్య తరగతి గదుల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. నాబార్డ్ నిధులతో నిర్మాణం జరుగుతున్న బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ స్కూల్స్ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను, పార్వతీపురంలో వున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కొత్తగా నిర్మితమవుతున్న భోజన షెడ్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనిఖీ చేసిన పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజినీర్ జె.శాంతీశ్వర్‌రావు, డీఈ, ఏఈ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాల్సిందే... : ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: అర్హత గల వారికి సంక్షేమ పథకాలు అందాల్సిందేనని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం పరిధిలో గల 20 సచివాలయాల వెల్ఫేర్-డిజిటల్ అసిస్టెంట్లతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి జగనన్నతో చెప్పుకుందాం కార్యక్రమంలో మన ప్రాంతం నుంచి ఎవరైనా తమకు సమస్య పరిష్కారం కాలేదని తెలిపితే వెంటనే వారి సమస్యపై స్పందించే సమాచారం మీ వద్ద సిద్ధంగా ఉండాలన్నారు. అందుకు మీరంతా కూడా ప్రజలందరి యొక్క సమగ్ర సమాచారం మీ వద్ద సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే అర్హులు అందరికీ అన్నీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు తప్పక అందేలా మీరంతా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా ఉందన్నారు. దీన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మా, ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం



పదమాయవలసలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాల వివరాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి అహర్నిశలు పాటు పడుతున్న ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలం పదమాయవలసలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడం, వారి అభ్యున్నతికి పాటుపడడం ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే పారదర్శకమైన పాలన అందించాలనే సంకల్పంతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలన సాగిస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి వారితో పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు. పారదర్శక పాలనతో పాటు కుటుంబంలో అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనేది గుర్తించేందుకు, స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గడచిన కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు అందించారు. జగనన్నే మా నమ్మకం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, సర్పంచ్ టి.సత్యనారాయణ, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఎంపీటీసీ సాంబమూర్తి, ఎం.దుర్గేశ్వరి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, మాజీ సర్పంచ్ సత్యంనాయుడు, రాజగోపాల్, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, సర్పంచ్‌లు విజయ, ఎస్.పాపారావు, కె.మోహనరావు, సుందరరావు, జగన్, కె.వెంకటరమణ, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజన్న చొరవతో కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛన్



ఫించను అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర చొరవతో కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛన్ మంజూరైంది. మండలంలోని కొత్తవలస పంచాయతీ గదబకరకవలస గ్రామానికి చెందిన అబలసింగి జగ్గయ్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక స్థోమత లేక సరైన వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ సమస్యను ఇటీవల ఆ గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు గ్రామస్తులు తెలిపారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి పింఛన్ మంజూరు చేయించారు. మంజూరైన పింఛన్ రూ.10వేలను సర్పంచ్ నెమలిపిట్ట ధర్మావతి చేతుల మీదుగా లబ్ధిదారుడికి గురువారం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కళ్యాణ్, జయసింహా, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: మండలంలోని సూరంపేట జంక్షన్ నుంచి రెండు కిలోమీటర్ల నిడివిలో ఐటీడీఏ నిధులు రూ.కోటితో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీఈతో పాటు సర్పంచ్ సిహెచ్.అప్పలనర్సమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీటీసీ బి.వరలక్ష్మి, మాజీ సర్పంచ్ సాంబన్నదొర తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కల్యాణం



లోక కల్యాణార్థం స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి రుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామి, లక్ష్మీనృసింహస్వాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. లక్ష్మీనృసింహస్వామి ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు సీహెచ్ గోపాలకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. కల్యాణ మహోత్సవాలను ఆగమ వేదపండితులు ఆమంది శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, కె.మురారి, బి.కృష్ణమాచార్యులు మూడు రోజుల పాటు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

కురుపాం: గృహనిర్మాణ శాఖ(కురుపాం)లో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సాలూరు రాధాకృష్ణ(54) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులు గురువారం శివ్వన్నపేటలో వర్క్ఇన్‌స్పెక్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు ఉన్నారు.

పన్నుల వసూలులో ప్రథమ స్థానం



అన్నంనాయుడురు సత్కరిస్తున్న కమిషనర్ కృష్ణారావు, తదితరులు

రాజాం సిటీ: అందరి సహకారంతోనే రాజాం మున్సిపాల్టీ ఈ ఏడాది పన్నుల వసూళ్లలో జిల్లాలోనే ప్రథమ స్థానం నిలవడం అభినందనీయమని కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. ఇందులో భాగంగానే పట్టణంలో అధిక పన్ను చెల్లించిన వారిని గురువారం సత్కరించారు. ప్రతి ఏడాది మాదిరిగా జీఎంఆర్ గ్రూపు ఈ ఏడాది సుమారు రూ. 27 లక్షల మేర పన్ను చెల్లించడంతో ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఆర్.అన్నంనాయుడుకు మెమొంటో అందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

- ప్రాంతీయ వ్యవసాయాధికారి జనార్దనరావు

రాజాం సిటీ: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని అనకాపల్లికి చెందిన వ్యవసాయ ప్రాంతీయ అధికారి పీవీకే జనార్దనరావు అన్నారు. ఇంటర్న్‌షిప్ ద్వారా నైరా కళాశాల విద్యార్థులు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా పొగిరి గ్రామంలో ‘ రైతు సదస్సు–వ్యవసాయ ప్రదర్శన’పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రైతు ఉత్పాదక మినీ ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని.. దీంతో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. నేలలో చిరుధాన్యాలు జల్లుకోవడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. రాజాం ఏడీఏ కె.చంద్రరావు మాట్లాడుతూ, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు వంటి విత్తనాలు సాగుచేయడం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సైంటిస్ట్ కె.లక్ష్మణ, ఏడీఏ కె.చంద్రరావు, ఏఓ ఎం.రేణుకాసాయి, సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొగిరి లెనిన్, పి.రమాదేవి, పి.వెంకటరమణ, పి.భారతి, విద్యార్థులు సీహెచ్‌ఎన్‌జే ప్రసన్న, కె.స్నేహిత, కె.సాహితీ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: ఇటీవల తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొన్నాడ శ్రీనివాసరావు కుటుంబానికి రూ.3లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర గురువారం అందజేశారు. పట్టణంలో తన గృహంలో ఈ చెక్కును శ్రీనివాసరావు భార్య పద్మకు అందించారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నే మా భవిష్యత్’ ప్రచార సామగ్రి పంపిణీ



బలిజిపేట: నూకలవాడలో కన్వీనర్లకు మెటీరియల్ పంపిణీ

బలిజిపేట: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార సామగ్రిని నూకలవాడలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, గృహసారథులకు జెడ్పీటీసీ ఎ.రవికుమార్ గురువారం పంపిణీ చేశారు. నూకలవాడ, చిలకలపల్లిలో వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఎ.రవికుమార్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బలిజిపేట సర్పంచ్ రాఘలత, చిలకలపల్లి సర్పంచ్ సుందరరావు, జగన్, కె.వెంకటరమణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..



సీతానగరం: జగనన్నే మా భవిష్యత్ సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ రవణమ్మ

సీతానగరం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీపీ బి.రవణమ్మ కోరారు. బగ్గందొరవలస, పెదంకలాం, గెడ్డలుప్పి, రంగంపేట, కాశీపేట సచివాలయాల్లో దీనికి సంబంధించిన ప్రచార సామగ్రిని గురువారం ఆమె పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు జి.అన్నంనాయుడు, బి.నందిని, సచివాలయ గృహసారథులు పాల్గొన్నారు.

నూకలవాడలో ‘ఫ్యామిలీ డాక్టర్’



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన జడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని నూకలవాడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ గురువారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మహీపాల్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ముంగిటకే వచ్చి వైద్యం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. వైద్యాధికారి మహీపాల్, సీహెచ్‌ఓ వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్ రాఘలత, కె.వెంకటరమణ, జగన్, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.